క్లుప్తంగా

శివభక్తులకు ఉచితంగా అల్పాహారం పంపిణీ



భక్తులకు అల్పాహారాన్ని పంపిణీ చేస్తున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి

ఒంగోలు: శివరాత్రిని పురస్కరించుకుని ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ యువ నాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఆర్టీసీ ఆర్ఎం బి.సుధాకర్ రావు, డిపో మేనేజర్ శ్రీనివాసరావు, అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీగిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణలో భారీగా పాల్గొన్న మహిళా భక్తులు

ఒంగోలు మెట్రో: శ్రీగిరి శ్రీనివాసుడిని దర్శించడానికి శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం నిర్వహించిన గిరి ప్రదక్షిణ కార్యక్రమం ఘనంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అత్యంత భక్తిప్రపత్తులతో ఆధ్యాత్మిక భావనలను ద్విగుణీకృతం చేశారు. మాఘమాసం మహాశివరాత్రి పర్వదినంతో కూడిన శ్రవణా నక్షత్రం, శుక్రవారం అత్యంత పవిత్రమైనదని, శ్రీగిరి కొండపై కొలువైయున్న వెంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం ముక్తి ప్రదాయకమని శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ గౌరవాధ్యక్షుడు చలువాది బద్రీనాథ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ అధ్యక్షుడు రాధా రమణగుప్తా జంధ్యం, కోశాధికారి వలేటి కృష్ణారావు, కార్యవర్గ సభ్యులు నేరెళ్ల శ్రీనివాసరావు, చలువాది బ్రహ్మయ్య, కోటి సూర్యనారాయణ, దనిశెట్టి రామునాయుడు, పబ్బిశెట్టి శ్రీనివాసరావు, కనమర్లపూడి బాల, దోగిపర్తి మల్లికార్జున్, గోసంఘం వాసు, తదితరులు పాల్గొన్నారు.



ఒంగోలు జీజీహెచ్‌లో కేక్ కట్ చేస్తున్న నర్సులు



వివిధ రంగాల్లో రాణించిన మహిళలను సన్మానిస్తున్న వేదిక ఫౌండేషన్ సభ్యులు



కిమ్స్ వైద్యశాలలో కేక్ కట్ చేస్తున్న మహిళా వైద్యులు

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

మహిళలు ఉన్నత ఆలోచనలతో ముందుకెళ్లాలి



ఒంగోలు బార్ అసోసియేషన్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

ఒంగోలు: మహిళలు అన్ని రంగాల్లో పురోగమిస్తున్నా.. ఇంకా పూర్తిస్థాయిలో లక్ష్యాలు చేరుకోలేదని, ఈ విషయాన్ని అర్థం చేసుకుని ప్రతి ఒక్క మహిళ ఉన్నతమైన ఆలోచనలతో ముందుకెళ్లాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని జిల్లా న్యాయస్థానం ఆవరణలో న్యాయవాదుల బార్ అసోసియేషన్, కోర్టు ఉద్యోగులు, ఎన్‌జీవో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి మాట్లాడారు. మహిళల మీద జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా న్యాయవాదులు తమ వంతు పాత్ర పోషించాలన్నారు. వీలైనంత వరకు ఉచిత న్యాయ సహాయం చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తి అమ్మనరాజా, సీనియర్ సివిల్, జూనియర్ న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సత్యశ్రీనివాస్, న్యాయస్థానం ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు చాకిరి సుధాకర్, న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మానవ సేవకు మించినది ఏదీ లేదు...

ఒంగోలు టౌన్: నర్సింగ్ సిబ్బంది చేస్తున్న సేవకు సాటి లేదని గ్రేడ్ వన్ నర్సింగ్ పర్యవేక్షకురాలు సంపూర్ణమ్మ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సర్వజన ఆస్పత్రిలో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలందించిన నర్సులు ఎంతో మంది అమరులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ కరోనా బాధితులకు వైద్య సేవలు అందించారని కొనియాడారు. ఆపద సమయంలో సేవలు చేసి ప్రాణాలు పోసే నర్సులంటే సమాజం చేతులెత్తి నమస్కరిస్తుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, మహిళల భాగస్వామ్యం లేకుండా వ్యవస్థ ముందుకు నడవడం అసాధ్యమని పలువురు నర్సింగ్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ అసోసియేషన్ సభ్యులు ఎం.ఉదయలక్ష్మి, వందనాదేవి, హెడ్ నర్స్ నాంచారమ్మ పాల్గొన్నారు.

వేదిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో...

ఒంగోలు మెట్రో: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం స్థానిక దేవుడు చెరువు వద్ద గల వేదిక ఫౌండేషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ ఫౌండర్ ఎస్.కె.సైదాబీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు సూర్యకుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి ఆధునిక ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో పోటీపడుతూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు రమాదేవి, పాతూరి పద్మ, యశోద, లక్ష్మీకుమారి, లీలారాణి, సువర్ణ, ప్రకాశం జిల్లా గ్రంథాలయ విశ్రాంత ఉద్యోగి గురువారెడ్డి, వేదిక ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు

బీజేపీ ఆధ్వర్యంలో...

ఒంగోలు సెంట్రల్: స్వచ్ఛభారత్ అమలులో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో విలువైనదని, సంపూర్ణ ఆరోగ్య భారత్ సిద్ధించడానికి వారి సేవలు మరువలేనివని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి తీగల సత్యవతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సీతారామపురంలో శుక్రవారం వేడుకలు నిర్వహించారు. మహిళలు తమ రెక్కల కష్టంతో కుటుంబాలను పోషిస్తూ దేశ పురోభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి ధనిశెట్టి పావని మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ మహిళలకు గ్యాస్ సిలిండర్ వంద రూపాయలు తగ్గించటం హర్షణీయమన్నారు. రాష్ట్ర కిసాన్ మోర్చ ఉపాధ్యక్షుడు పి.వి.కృష్ణారెడ్డి, జిల్లా పార్లమెంటు కన్వీనర్ సెగ్గం శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు రాజేష్‌వర్మ, మండల అధ్యక్షుడు గుర్రం రంగనాథ్, మీడియా ఇన్‌చార్జి ధనిశెట్టి రాము పాల్గొన్నారు.

ప్రజా కళావేదిక ఆధ్వర్యంలో...

ఒంగోలు మెట్రో: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రజా కళావేదిక ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో ఆఫీసు ప్రాంగణంలో గల ఎన్టీఆర్ కళాక్షేత్రంలో శుక్రవారం మేలుకో కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ప్రజా కళావేదిక గాయకులు, మహిళాలు ఆలపించిన గీతాలు, దుద్దుకూరు గ్రామ వారి కోలాటం ప్రదర్శన ఆకట్టుకున్నాయి. అనంతరం సభా కార్యక్రమానికి ప్రజా కళావేదిక కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా బీఎంఆర్ సంస్థల చైర్మన్ శంకర్రావు పాల్గొని మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని ఆకాంక్షించారు. వీరవల్లి రుద్రయ్య మాట్లాడుతూ మహిళలు ప్రజా కళలు నేర్చుకుని ప్రదర్శనలు ఇవ్వాల్సిన అవసరం నేటి సమాజంలో ఎంతైనా ఉందని తెలిపారు. సభలో పాటలు, ప్రదర్శన, నూతలపాటి చంద్ర హాస్యపు వల్లరి, ప్రముఖ కోలాటం మాస్టర్ నందవరపు జాన్‌సాహెబ్కి ఆత్మీయ సన్మానం జరిగాయి. అనంతరం కనిపించే దైవం నాటిక ప్రదర్శించారు. కార్యక్రమంలో బొమ్మరిల్లు పి.రాజ్యలక్ష్మి, డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి, ప్రసాద్, అరుణోదయ అంజయ్య తదితరులు పాల్గొన్నారు. సమాజంలో ఉత్తమ సేవలు అందించిన పలువురు మహిళలకు సత్కారాలు అందించారు.



అల్లూరులో మాట్లాడుతున్న సుమన్

సమాజ అభివృద్ధిలో మహిళలే ముఖ్యం...

అల్లూరు (కొత్తపట్నం): సమాజం అభివృద్ధి చెందడానికి మహిళలే ముఖ్యమని కైలాస్ పత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్, సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ కౌన్సిలర్ సుమన్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అల్లూరు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో శుక్రవారం కైలాస్ పత్యార్థి ఫౌండేషన్, సార్డ్స్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. సుమన్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో చైతన్యవంతులు అయ్యారన్నారు. ఇంటికే పరిమితం కాకుండా సమాజంతో పాటు వివిధ రంగాల్లో తమ నైపుణ్యాలు ప్రదర్శిస్తున్నారని తెలిపారు. విద్య, సేవా సైన్స్ టెక్నాలజీ.. ఇలా అనేక రంగాల్లో మహిళలు చేసిన కృషి చాలా అద్భుతమన్నారు. సోషల్ వర్కర్లు వెంకట్రావు, బాలకాశమ్మ మాట్లాడుతూ మహిళలకు హక్కులు, చట్టాలు, విధులు వివరించారు. కుటుంబాలు, గ్రామాలు, సమాజంలో మార్పు రావాలంటే అన్ని రంగాల్లో మహిళలే ప్రాముఖ్యత వహించాలన్నారు. మహిళలు నాగేంద్రం, పి.అంజమ్మ, సుశీలమ్మ, ఎర్మిబిత్, సమాదానంలను సన్మానించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

పలు సంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో...

ఒంగోలు సెంట్రల్: మహిళా దినోత్సవాన్ని శనివారం పలు సంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ వడియరాజుల సేవా సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు తన్నీరు వీరసాయి అధ్యక్షతన గడపగడపకు తిరిగి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సీనియర్ మహిళలను సన్మానించారు. రాష్ట్ర అధ్యక్షుడు తన్నీరు ఆంజనేయులు, మహిళా అధ్యక్షురాలు నాగేశ్వరమ్మ, తన్నీరు హరిణి, ఆమణి, కవిత, శిరీష, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. క్విస్ కాలేజీ ఆఫ్ ఫార్మసీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంస్థ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ సూర్యకళ్యాణ్, ప్రిన్సిపాల్ డాక్టర్ దక్షిణామూర్తి, ఫార్మసీ విభాగాధిపతి డాక్టర్ రేవతి, కో ఆర్డినేటర్ ధనమూర్తి తదితరులు పాల్గొన్నారు. జన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో డైరెక్టర్ శ్యాం సునీల్ అధ్యక్షతన మహిళా దినోత్సవం నిర్వహించారు. బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఒంగోలు మాత మాధవి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పీఓ హరిక్రిష్ణ, మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్‌లో...

ఒంగోలు టౌన్: వైద్య రంగంలో మహిళల పాత్ర ఎంతో కీలకమైనదని, మహిళా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది లేకుండా వైద్య రంగాన్ని ఊహించలేమని కిమ్స్ సీఓఓ అంకిరెడ్డి అన్నారు. శుక్రవారం కిమ్స్ వైద్యశాలలోని మహిళా వైద్యులు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఉమెన్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డా.శ్రీహరి, టి.గిరి, డా.గీతా, డా.హైందవి, మాధురి, డా.సింధు, డా.అనూష, రజని, వాణి, భార్గవి, అరుణ ప్రియ తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న మహిళా మోర్చా నాయకులు



ప్రజా కళావేదిక ఆధ్వర్యంలో కోలాటం ప్రదర్శన



మాట్లాడుతున్న ఒంగోలు మాత మాధవి

భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి పూజలు



అరుణాచలేశ్వరస్వామి



నాగేశ్వరస్వామి గ్రామోత్సవం..

ఒంగోలు మెట్రో: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఒంగోలు నగరంలోని శైవక్షేత్రాల్లో శుక్రవారం భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. స్థానిక కేశవస్వామిపేటలోని కాశీవిశ్వేశ్వర ఆలయం, కొత్తపట్నం బస్టాండ్లోని రాజరాజేశ్వరస్వామి ఆలయం, సంతపేట సాయిబాబా మందిరంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించగా, భక్తులు భారీగా పాల్గొన్నారు. స్వామివారికి అభిషేకాలు, రాత్రి లింగోద్భవ సమయాన మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. అంజయ్య రోడ్డులోని పంచముఖేశ్వర శివాలయం, రంగారాయుడు చెరువు వద్ద ఉన్న అరుణాచలేశ్వర ఆలయం, మంగమూరు రోడ్డులోని హరిహరసుత అయ్యప్పస్వామి ఉపాలయంగా ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామికి, మంగమూరు రోడ్డులోని జెడ్పీ కాలనీలో శ్రీ సత్యసాయిబాబా మందిరంలో మహేశ్వరుడికి, లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరంలోని మరకత శివలింగానికి విశేష అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.



రామతీర్థంలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న మారం వెంకారెడ్డి

మద్దిపాడు మండలంలో...

మద్దిపాడు: మండలంలోని అన్ని శైవాలయాల్లో ప్రత్యేక పూజలు చేయగా, భక్తులు భారీగా పాల్గొని స్వామివారిని దర్శనం చేసుకున్నారు. తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. ఆలయ అర్చకులు మహాశివరాత్రి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు గురువారం రాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకూ శివాలయాల్లో భక్తులు భజనలు చేస్తూ గడిపారు.

కొత్తపట్నం మండలంలో...

కొత్తపట్నం: మండలంలోని శివాలయాల్లో మహాశివరాత్రి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వమించారు. మడనూరులో రామలింగేశ్వరస్వామి, కొత్తపట్నం నాగేశ్వరస్వామి, పాదర్తిలో భవన్నారాయణస్వామి ఆలయాల్లో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. మడనూరులో రామలింగేశ్వరస్వామి ఆలయంలో గంగపర్వతివర్ధనీ అమ్మవారికి కుంకుమార్చన, రామలింగేశ్వరస్వామికి ఏనుగు వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఒంగోలు డీఎస్పీ కిషోర్‌బాబు కుటుంబ సమేతంగా పాల్గొని పూజలు చేశారు.



చీమకుర్తి హరిహరక్షేత్రంలో పూజలు చేస్తున్న శిద్దా రాఘవరావు

శివ పరమాత్మయోగంతో మనిషికి సుఖశాంతులు

ఒంగోలు టౌన్: శివ పరమాత్మ యోగంతోనే మనిషికి సుఖశాంతులు లభిస్తాయని బ్రహ్మకుమారి మాధవి అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం నగరంలోని బాల సంజీవని ధామం, బచ్చల బాలయ్య సంజీవమ్మ ధార్మిక భవనంలో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ప్రదర్శించిన ద్వాదశ జ్యోతిర్లింగ, అమర్నాథ్ మంచు లింగం, పాలాభిషేక లింగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా మాధవి ప్రసంగిస్తూ.. మనలోని వికారాలను హరిస్తేనే సుఖమయ జీవితం సాధ్యమవుతుందన్నారు. బ్రహ్మకుమారీల బోధనలను ఆచరిస్తే ప్రతి ఒక్కరి జీవితాలలో శాంతి సౌభాగ్యం లభిస్తుందని భవనదాతలు మునికృష్ణయ్య, హరిప్రియ దంపతులు అన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్‌డీఏ సహాయ ప్రాజెక్టు అధికారి డాక్టర్ జీవీ వరప్రసాద్, ఏపీఓపీఏ కార్యదర్శి నాగేశ్వరరావు, డాక్టర్ రావిపాటి ప్రసాదరావు, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ సాయిబాబా, బ్రహ్మకుమారిలు రేవతి, భవాని తదితరులు పాల్గొన్నారు.



సంతపేటలో శివలింగానికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని దంపతులు

చీమకుర్తి, సంతనూతలపాడు మండలాలలో...

చీమకుర్తి: శివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం రామతీర్థం, చీమకుర్తి, సంతనూతలపాడు మండలాలలోని పలు శైవక్షేత్రాలలో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. రామతీర్థంలోని శ్రీమోక్ష రామలింగేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. శ్రీయోగి వేమన రెడ్ల సత్రంలో వైఎస్సార్ సీపీ అద్దంకి పరిశీలకుడు మారం వెంకారెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. చీమకుర్తి హరిహరక్షేత్రంలో వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, కుటుంబ సభ్యులు పూజలు చేశారు.



మద్దిపాడు శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



రామతీర్థంలో మోక్షరామలింగేశ్వరస్వామిని దర్శించుకునేందుకు పోటెత్తిన భక్తులు



శివరాత్రి వేడుకలు ప్రారంభిస్తున్న బ్రహ్మకుమారి ప్రతినిధులు

సంక్షేమం, అభివృద్ధే జగనన్న అజెండా

● పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి మేరుగు నాగార్జున



పేర్నమిట్టలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి: పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అజెండా అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. శుక్రవారం సంతనూతలపాడు మండలంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించి సుడిగాలి పర్యటన చేశారు. పేర్నమిట్టలోని ఒంగోలు 42వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయనన్ని సంక్షేమ పథకాలను మన రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికలలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలన్నారు. అనంతరం వలంటీర్లకు సేవాపురస్కారాలిచ్చి సత్కరించారు. పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. పేర్నమిట్టలో నిర్మించిన సైడు కాలువలు, సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సంతనూతలపాడులో స్వీపర్లను సత్కరించారు. గుమ్మనంపాడు గ్రామంలో స్థానికులు నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ముఖద్వారాన్ని ప్రారంభించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మద్దులూరు గ్రామంలో రూ.21.8 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయా కార్యక్రమాలలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బీ విజయ, స్థానిక కార్పొరేటర్లు నూకతోటి మస్తానమ్మ, గోలి లక్ష్మీకోటేశ్వరమ్మ తిరుపతిరావు, షేక్ పాత్యా సాహెబ్, బీ శివరామయ్య, బీ శైలజ అమర్‌నాథ్, బోడెంపూడి శ్రీనివాసరావు, స్థానికులు పాల్గొన్నారు.

సిద్ధం సభ జనసమీకరణపై సమీక్ష



కార్యక్రమంలో పాల్గొన్న మేరుగు చందన్

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ యూత్ విభాగం బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు మేరుగు చందన్ ఆధ్వర్యంలో శుక్రవారం చీమకుర్తిలో సిద్ధం సభ జనసమీకరణపై సమీక్ష నిర్వహించారు. ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, బూత్ కోర్ కమిటీ ఇన్‌చార్జి పరంధామరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ప్రణీత్‌రెడ్డి



పోటీలను ప్రారంభిస్తున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి

ఒంగోలు రూరల్: మండలంలోని కరవదిలో ఏర్పాటు చేసిన హనుమంతరావు హెడ్‌మాస్టర్ స్మారక రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ టోర్నమెంటును వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి శుక్రవారం రాత్రి ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి నిర్వాహకులు రూపొందించిన ప్రత్యేక వాలీబాల్ కోర్టును ప్రారంభించారు. అనంతరం తొలి సర్వీసు చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. గురువుల పట్ల గౌరవభావం కలిగి ఉండటం సహజమేనని, దశాబ్దాల పాటు ఆయనపై గౌరవం కలిగి రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ టోర్నమెంటు నిర్వహించడం ఆయనపై అప్పటి విద్యార్థులకు ఉన్న భక్తిభావానికి నిదర్శనమని అన్నారు. తద్వారా ఆయన చేసిన విద్యాబోధనపై మరింత గౌరవం పెరిగిందన్నారు. వాలీబాల్‌లో నైపుణ్యం కలిగిన హెడ్‌మాస్టర్ హనుమంతరావు విద్యార్థులను క్రీడల వైపు స్వయంగా శిక్షణ ఇచ్చి ప్రోత్సహించిన విషయాన్ని నిర్వాహకులు గుర్తుచేసుకున్నారు. అనంతరం కృష్ణ, గుంటూరు జట్ల మధ్య పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్‌వీఎస్ రాధాకృష్ణ, ఎంపీటీసీ మన్నె శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ డి.కోటేశ్వరరావు, మాజీ సీఐ భాస్కరరావు, మాజీ క్రీడాకారులు శిరిగిరి రంగారావు, ఆర్ఎంపీ ప్రభాకర్‌కుమార్, శిరిగిరి అంజయ్య, వెంకటశేషయ్య, నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు శివకుమార్, ఒంగోలు మండల ప్రణీత్‌రెడ్డి యూత్, బాలినేని యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. కృష్ణ–గుంటూరు, నెల్లూరు–ప్రకాశం జట్ల మధ్య మ్యాచ్‌లను ఫ్లడ్ లైట్ల వెలుగులో నిర్వహించారు.